తుది వీడుకోలు

“రాత్రి ప్రథమయామం గడిచిపోయింది.” అన్నాడానందుడు ప్రశాంత గంభీరస్వరంతో.

ఆ రాత్రివేళ కుశీనరగ్రామంలో సాలవృక్షవనంలో నిట్టూర్పులైనా విడవకుండా నిశ్చల మూర్తులై నిలబడిన భిక్షుక సంఘము, కుశీనర జానపదులు ఆ మాటలు విని నిశ్శబ్దంగా నిట్టూర్పులు విడిచారు.

వెనువెంటనే భిక్షుకులందరి కనుగొలుకులలోను కన్నీటి బిందువులు నిలిచాయి. కొందరాత్మనిగ్రహం అవలంబించి ఆ కన్నీటి బిందువులింక చెంపపై దిగజారకుండా నిలువరించుకొన్నారు. మరికొందరి కెంత ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. బాష్ప బిందువులు నెమ్మదినెమ్మదిగా వారి చెక్కిళ్ళపై దిగజారాయి.

ఆనందుడంతటివానికే ఆ విషయంలో ఆత్మనిగ్రహం దుస్సాధ్యమైపోయినప్పుడిక సామాన్య భిక్షుకులా విధంగా అధైర్య పడిపోవడంలో ఆశ్చర్యం ఏమి ఉంది? అయినా అటుపిమ్మట ఆనందుడెంతో ధైర్యం అవలంబించి అలాగే ఆకాశంలో నక్షత్రాలవైపు చూస్తూ నిలుచున్నాడు.

క్రమక్రమంగా రాత్రి రెండోయామం కూడా గడిచిపోతూంది. రోహిణి శిరోనక్షత్రమై నిలిచేసరికి మూడో యామంకూడా గడిచిపోతుంది. ఆ క్షణంలో అతనికి చిరకాలంగా తన జీవితంలో ధ్రువతారకగా నిలిచిన తథాగత దేవుని స్మితజ్యోతి కూడా అంతర్హితమై పోగలదేమోనని అనిపించింది. ఆ విషయం తలుచుకునేసరికి ఆనందుని చెక్కిళ్ళపై వేడివేడి కన్నీటి బిందువులు ప్రవహించాయి.

కుశీనరగ్రామం చేరుకోగానే బుద్ధదేవుని దేహస్వాస్థ్యం బాగా క్షీణించి పోయింది. ఆయన నేత్రాలలో ఎన్నడూ లేని బడలిక ప్రారంభ

మైనది. ఒకనాటి ప్రభాతవేళ ఆనందుని తన సన్నిధికి పిలిచి, ప్రశాంతంగా అన్నాడు :

"ఆనందా! నేటి రాత్రి మూడవయామం అవసాన సమయంలో ఇక నా పరినిర్వాణం జరుగనున్నది. నా కిక విశ్రమించవలెనని ఉన్నది."

ఆనందుని కా మాట మహాశనిపాతంలా వినబడింది. అయితే గౌతమదేవు డతనిని అనేకవిధాలుగా ఓదార్చి తన అనంతరం బౌద్ధభిక్షువు లవలంబించవలసిన ధర్మాలు, నియమాలు మొదలయినవన్నీ సంగ్రహంగా ఉపదేశించాడు.

అటు పిమ్మట ఆనందుడు గౌతమబుద్ధునికి హిరణ్యవతీ నదీతీరంలో గుబురులుగుబురులుగా పెరిగిన సాలతరువుల లతానికుంజంలో మెత్తని తరుపర్ణ పుష్పశయ్య ఏర్పాటు చేశాడు. బుద్ధు డా శయ్యపై ఉత్తరాభిముఖంగా శయనించి నిశ్చలధ్యాన నిష్ఠలో నిమగ్నుడై నాడు.

ఆ వార్త క్రమక్రమంగా భిక్షువులందరికీ తెలిసింది. వెంటనే వారంతా హిరణ్యవతీ నది దాటి సాలవనంలో ప్రవేశించారు. గౌతమబుద్ధుని నికుంజ శయ్య కనతిదూరంలో నీరవ నిశ్చలమూర్తులై నిలుచున్నారు.

ఎక్కడా ఆకల్లాడిన సవ్వడికూడా వినబడడంలేదు. సమ్యక్సంబుద్ధుని శిరస్సువైపున, పాదాలవైపున నిశ్చలంగా నిలిచిన సాలతరువులు రెండు తదేక దృష్టితో ఆయనముఖం వైపే తిలకిస్తున్నట్లు స్ఫురించాయి. ఆ నీరవ నిశీథవేళలో అప్పుడప్పుడు సాలతరువులనుండి రాలే పువ్వుల సవ్వడి మాత్రమే విస్పష్టంగా వినవస్తున్నది. అంతలోనే విశాల నీలాకాశంలో ఒక తారక రాలిన ట్లొక చిన్న కదలిక మెరిసింది. వెంటనే ఆ వెలుగు నిశ్శబ్దంగా ప్రవహించే హిరణ్యవతిలో ప్రతిఫలించింది.

ఆ సమయంలో ఆనందుని కొక్కమారుగా బుద్ధదేవుని సన్నిధిని గడిచిపోయిన ఆనందమయ క్షణాలన్నీ స్ఫురణకు వచ్చాయి. అత డెంతో కాలంనించి గౌతమునికి అంతేవాసిగా, తోడునీడగా మసులుకుంటున్నాడు. అయితే ఆ సుదీర్ఘ కాలం అంతా అతని కప్పు డొక క్షణలేశమై భాసించింది.

అంతలోనే ఉపావణు డానందుని సన్నిధికివచ్చి ఎంతో దీనంగా తలవాల్చి నిలుచున్నాడు.

ఆనందు డతని వైఖరి చూచి జిజ్ఞాసార్థకంగా బొమముడి విరిచాడు. ఉపావణుడు చిరకాలంనించీ తథాగతునికి వీవన విసురుతూ తోడునీడలా వెంటనంటి తిరిగే ఉపాసకభిక్షువు. అతడు నాటిరాత్రి కూడా సిద్ధార్థుని పార్శ్వంలో నిలబడి నెమ్మది నెమ్మదిగా వీవన విసురుతూ నిలుచున్నాడు. కాని గౌతము డది చాలించి విశ్రమించ వలసిందని ఆదేశించాడు.

ఉపావణుడు మూడవయామం గడిచేవరకూ ఒక్క క్షణమైనా ఏమరకుండా గౌతమదేవుని పార్శ్వంలో నిలబడి, చేతులారా ఆచార్యదేవునికి పరిచర్యచేసి జన్మ సాఫల్యం పొందవలెనని ఎంతైనా ఉబలాట పడ్డాడు. కాని అతని ఆశ ఫలించలేదు. అతని హృదయం కరిగిపోయింది. ఆ విషయమే ఆనందునికి తెలియజేశాడు.

ఆనందు డది విని నిర్ఘాంతపోయి వెంటనే బుద్ధదేవుని సన్నిధికి వెళ్ళి ఉపావణుని దీన వృత్తాంతం అంతా ఆయనకు తెలియజేశాడు. గౌతమబుద్ధు డొక చిరునవ్వునవ్వి నెమ్మదిగా ఇలా అన్నాడు:

"ఆనందా! తుషితస్వర్గంలో దేవతలందరూ నా పరినిర్వాణ శుభ ముహూర్తం నిరీక్షిస్తూనాకోసమై ఆకాశంలో బారులుదీరి నిలుచున్నారు. ఉపావణుని వీవనచూచి వారందరు ఆ వీవన తమ కడ్డుగా ఉన్నదనీ, బుద్ధదేవుని తనివిదీరా సందర్శించడాని కొక విఘాతం ఏర్పడిందనీ పరిపరి విధాలుగా గుసగుస లాడుకొంటున్నారు. అందువల్లనే నే నుపావణునికి విశ్రమించవలసిందని ఆదేశించాను. అంతేగాని ఈ విషయంలో అతనివల్ల జరిగిన అపచారమేమీ లేదు!" అన్నాడు.

ఆనందు డాశ్చర్యవిస్ఫారిత నేత్రాలతో ఆకాశం అంతా కలయ జూచాడు. అతని చర్మచక్షువుల కెక్కడా తుషితస్వర్గ దేవతలు కనిపించ లేదు! అయినా కొంతసేపటివరకు అలాగే బుద్ధదేవునివైపు చూచి, సవినయంగా ఆయనదగ్గర సెలవు తీసికొని, తిరిగి ఉపావణుని కా విషయం అంతా తెలియజేశాడు. ఆత డా వార్త విని ఒక్కపెద్ద నిట్టూర్పు విడిచి పెట్టాడు. దానితో అతని హృదయం బాగా తేలికపడింది.

అంతలో ఆనందుని నేత్రాలు తిరిగి తారకలవైపు తిరిగాయి. అత డొక దీర్ఘ నిశ్వాసం విడిచిపెట్టి ఆ పక్కనున్నవారికికూడా వినబడీ వినబడ

నెమ్మదిగా "ద్వితీయ యామంకూడా గడిచిపోయింది!" అన్నాడు. ఆ మాట వినగానే భిక్షుసంఘం దృష్టులన్నీ సాలవృక్ష లతానికుంజ మధ్యప్రదేశంలో పర్ణ పుష్పశయ్యపై పవళించిన బుద్ధదేవుని ముఖంవైపు ప్రసరించాయి.

2

ఆకాశంలో తారకలన్నీ నిశ్చల నేత్రాలతో ఆ దృశ్యమే తిలకిస్తున్నట్లు మెరిశాయి. మూడో యామంకూడా కొంతవరకు గడిచిపోయింది. అంతలో సుభద్రు డనే భిక్షు వానందుని సమీపానికి వచ్చి నిలుచున్నాడు. ఆనందు డతనిని చూచి చాలాకాలమైంది. సుభద్రుడు దూరప్రయాణం చేసి బాగా అలసిపోయినట్లున్నాడు. ఆనందు డతనిని బాగా పరిశీలనగా చూచి నిర్ఘాంతపోయి నెమ్మదిగా ఇలా అడిగాడు:

"సుభద్రా! ఎక్కడినుంచి ఈ రాక!"

"వైశాలినించి!"

"తథాగతులను సందర్శించడానికేనా?"

"అవును! అందుకోసమే మున్ముందుగా తమ సన్నిధికి వచ్చాను."

"అయ్యో! వేళ మించిపోయింది. నాయనా! తథాగతుల పరినిర్వాణ సమయాని కిక ఒక రెండు గడియలు మాత్రమే అవధి!"

"అర్హతదేవా! నా కది తెలియకపోలేదు! ఈ దీనుని కింతవరకు తథాగతుల ముఖతః ధర్మదీక్ష స్వీకరించే భాగ్యం కలగలేదు! ఆ మహాదృష్టం కలిగించవలసిందని అర్థించడానికే మీ సన్నిధికి వచ్చాను! నాకీ వరం అనుగ్రహించండి!"

"ఈ చివరి క్షణంలోకూడా వారికి శ్రమ కలిగించడం ధర్మంకాదు నాయనా! మహాభినిష్క్రమణక్షణంనుంచీ ఈ క్షణందాకా ఆయన అహోరాత్రాలు నిద్రాహారాలు లేకుండా మన అందరిమీద అపార కరుణామృతం వర్షించారు. ఇటీవల అస్వస్థులై చిక్కి శల్యమైపోయారు. ఇప్పు డొక్క క్షణంపాటు ప్రశాంతంగా మౌనముద్ర వహించారు! నా మాట విను నాయనా! వారికి మౌనభంగం కలిగించటం న్యాయం కాదు!"

కాని సుభద్రుడు తనపట్టు విడిచిపెట్టలేదు. అలాగే అతి దీన స్వరంతో కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలడం మొదలుపెట్టాడు.

అంతలో ఒక అరగడియ గడిచిపోయింది. ఇంక మిగిలిన దొక అర గడియ మాత్రమే! సుభద్రు డిక లాభంలేదని చాపచుట్టగా ఆనందుని కాళ్ళపై పడ్డాడు. ఆనందుడు తన కంఠస్వరం బాగా తగ్గించి—

"నాయనా! సుభద్రా! నన్నిక నిర్బంధించకు! ఏమైనాసరే! నీ వీ సమయంలో తథాగతులను సందర్శించడానికి వీలులేదు!" అన్నాడు.

సుభద్రు డొకక్షణకాలం నిశ్చలంగా ఎంతో జాలిగా ఆనందుని వైపు చూచి గద్గద స్వరంతో ఒక పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టాడు.

"అర్హతా! శతకోటి జన్మలకైనా నాకిక స్వయంగా తథాగతుల సన్నిధిని ధర్మదీక్ష స్వీకరించే మహాభాగ్యం కలగదుగదా!"

"అవును సుభద్రా! నాకిది తెలియకపోలేదు! అయితే సమయం మించిపోయిన తరవాత మన మేమి చెయ్యగలం చెప్పు నాయనా!"

"అంతేనా? మీ కీ దీనునిపై మరి కరుణ కలగదా!"

"కరుణించవలసినవా రా సమ్యక్సంబుద్ధులుగాని నే నెంతవాణ్ణి సుభద్రా!"

"ఈ క్షణంలో కరుణించి అనుమతించవలసినవా రిక మీరే గదా!"

"కావచ్చును! కాని వేళ మించిపోయింది నాయనా!"

ఆ మాట వినగానే సుభద్రుని ముఖం వివర్ణమై వెలవెలపోయింది. గొంతు తడి ఆరిపోయింది. తిరిగి ఒక నిట్టూర్పు విడిచిపెట్టాడు.

అంతలో సాలవృక్షాల నడుమనుంచి అమృతమాధుర్యం తొణికిసలాడే పిలుపొకటి వినబడింది. గౌతమబుద్ధుడు క్షీణస్వరంతో నెమ్మదిగా "ఆనందా!" అని పిలిచాడు.

ఆనందు డా పిలుపు వింటూనే ఒక్క అంగలో బుద్ధదేవుని శయ్యా సమీపానికి వెళ్ళి నిలుచున్నాడు.

"ఆనందా! ఆ వచ్చినవారెవరు?"

"ఉపాసక సుభద్రుడు. స్వయంగా మీ ముఖతః ధర్మదీక్ష స్వీక రించవలెనని, దర్శనం ఇప్పించవలసినదనీ నిర్బంధిస్తున్నాడు. అయితే ఇది సముచిత సమయం కాదని—"

‘‘అకొహ్యా! అలాగా! నాయనా! వెంటనే లోపలికి తోడుకురాలేక పోయినావా! ఎంతపని చేశావు! తొందరగా లోపలికి తోడుకురా!’’

ఆనందుడు గురుదేవుని ఆజ్ఞ వింటూనే సుభద్రు నక్కడికి తీసుకు వచ్చాడు. తరవాత వారిద్దరిని అక్కడ విడిచి లతానికుంజద్వారంలో నిలబడ్డాడు. అయితే అతని నేత్రాలు రెండూ గౌతమదేవునివైపే తిలకిస్తున్నాయి.

అప్పుడే ఉదయించిన చంద్రవంక వెలుగుల్లో సాలతరువనం అంతా అతనికొక చల్లని పాలవెల్లిలా స్ఫురించింది. చిరునవ్వులు చిలకరిస్తూ ఆచార్యదేవుడు సుభద్రునివైపెంతో ఆప్యాయంగా చూస్తున్నాడు. మధ్య మధ్య చల్లనిమాటలతో అతని కష్టాంగ ధర్మదీక్ష అనుగ్రహిస్తున్నాడు. క్రమక్రమంగా ఆచార్యదేవుని చిరునవ్వులు వెన్నెల వెలుగులలో కలిసిపోతున్నాయి.

సుభద్రుడు ధర్మదీక్ష స్వీకరించి తిరిగి నికుంజద్వారందగ్గిరికి వచ్చాడు. అతని ముఖంలో ఒక్కనిమేషంవరకు ఆనంద సాగరం తాండవించింది!

ఆనందుని పాదాలకు మోకరిల్లి ‘‘అర్హతా! మీ దయవల్లనే నాకు సాక్షాత్తుగా తథాగతుల ముఖతః ధర్మదీక్ష స్వీకరించే మహాభాగ్యం కలిగింది! ఇక నా జన్మ తరించింది! అయితే ఈ తుదిగడియలో కూడా ఆ కరుణామూర్తిని, మిమ్మల్ని ఎంతైనా శ్రమ పెట్టాను. నన్ను మన్నించండి!’’ అన్నాడు. అతని ముఖంఅంతా కన్నీటితో తడిసిపోయింది. అనంతరం సుభద్రుడు నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ భిక్షుసంఘంలో ప్రవేశించాడు. తదేక దృష్టితో తథాగతుని ముఖం వైపే తిలకిస్తూ నిలుచున్నాడు.

ఆ సమయంలో ఆనందునికి గౌతమదేవుని అపార కరుణాస్వరూపం అంతా ఒక్కమారుగా మూర్తీభవించినట్లయింది!

బుద్ధదేవు డిటీవల కలిగిన అస్వాస్థ్యం వల్ల ఊపిరికూడా విడవలేనంతగా చిక్కి శల్యమైపోయాడు. తుది గడియలో ఒక్క క్షణంపాటు ప్రశాంత మౌనసముద్ర వహించి పర్ణ పుష్పశయ్యపై విశ్రమింపవలెనని సంకల్పించాడు. ఆ విధంగా రెండు యామాల కాలం గడిచిపోయింది. అంతలోనే సుభద్రుడక్కడికి వచ్చాడు. ఆనందు డిక ఆచార్యదేవునికి శ్రమ

కలిగించడం భావ్యం కాదని అనుకున్నాడు. అయినా ఆ చరమక్షణంలో కూడా సుభద్రుని కెంతో ఆప్యాయంగా ధర్మదీక్ష అనుగ్రహించాడు. ఆ సమయంలో ఆ ముఖంలో కొంచెమైనా అలసటగాని, విసుగుదలగాని పొడచూపలేదు. ఎంతటి శిష్యవాత్సల్యము! ఎంతటి మహాకరుణ! జీవ చైత న్యంతో తొణికిసలాడే ఆ మహా కృపామూర్తి స్మితజ్యోతి తిరిగి ఈ భూతలంపై మెరయదుకదా!

ఆ విధంగా ఆ క్షణంలో ఆనందుని హృదయంలో ఎన్నెన్నో ఆర్ద్రభావ పరంపర లుద్భవించాయి; ఆనందు డొక్కసారి ఆచార్యదేవుని సన్నిధికి వెళ్ళి ఆయన పాదా లొక్కసారి స్పృశింపవలెనని అనుకొన్నాడు. కాని దానివల్ల గౌతమదేవుని విశ్రాంతికి భంగం కలగ గలదేమోనని భయం వేసింది. అందువల్ల వెంటనే ఆ సంకల్పం విరమించాడు.

అంతలో మూడవ యామం కూడా గడిచిపోయే సమయం ఆసన్న మయింది. అనిరుద్ధాది అర్హతులంతా ఆచార్యదేవుని కనతి దూరంలో నిల బడి నిశ్చలంగా ఆ దివ్యస్మిత జ్యోతివైపే తిలకిస్తున్నారు. సమీపంలో సన్నని వెలుగుతో ప్రవహించే హిరణ్యవతీ నది కూడా ప్రవహించడం విర మించి అక్కడే నిలబడి అలాగే స్తంభించిపోయింది. ప్రపంచం అంతా ఒకే మహా ప్రశాంత స్వరూపం ధరించింది.

3

"ఆనందా!" అని అంతలో ఇంకొక పిలుపు వినబడింది. ఆ పిలుపు విన బడగానే ఆనందునికి శరీరం అంతా ఒక శిరీష పుష్పంలా వికసిం చింది. నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఆచార్యుని శయ్య సమీపించాడు. అనిరుద్ధాది శిష్యులంతా చుట్టూ నిలుచుండి ఇక ఏ క్షణంలో మహాపరి నిర్వాణం జరగగలదో అని ఎంతో ఆత్రంగా నిరీక్షిస్తున్నారు. ఆకాశంలో తారకలన్నీ ఆ విషయమే గుసగుసలాడుకొంటున్నట్టుగా మెరుస్తున్నాయి.

ఆనందుని దృష్టి తిరిగి ఇంకొకమారు తారకలవైపు తిరిగింది. అతని కిక మహాపరినిర్వాణసమయ మాసన్నమైనదని స్ఫురించింది. ఆనందుని హృదయంలో స్తంభించిన ధైర్యసాగరం ఒక్కమారుగా విజృంభించి అల్లకల్లోలమై పొంగింది!

అత డిక నిలబడలేక తథాగతదేవుని పాదాలపై వాలిపోయాడు! పసిపాపలా విలపించాడు! అతనికి తిరిగి ఇంకొక ఆర్ద్రాహ్వానం వినిపించింది!

ఆనందుడు ధైర్యం చిక్కబట్టుకుని నిశ్చల దృష్టితో బుద్ధదేవుని చరమోపదేశం వినవలెననే కుతూహలంతో అలాగే నిరీక్షిస్తూ నిలబడ్డాడు.

“ఆనందా! జన్మించినవారికి మరణం అనుల్లంఘనీయమని నీ కనేక మారు లుపదేశించాను. ఇప్పు డదే జరుగనున్నది. దీనికై విచారించ నేల? నీవంటి శ్రద్ధాళువులకు నిర్వాణం కరతలామలకం!”

ఆ ఉపదేశంతో ఆనందుని హృదయం తిరిగి స్థిరపడింది.

అటుపిమ్మట గౌతమబుద్ధు డక్కడ సమావిష్టులయిన భిక్షువులను, కుశీనర జానపదులను, హిరణ్యవతీ నదిని, సమస్త ప్రాణి లోకాన్ని ఎంతో ఆప్యాయంగా చూచాడు. అతని విశాల విలోచనాలు చుట్టూ నిలిచిన ప్రతి ప్రాణిని, ప్రతిపదార్థాన్నీ పలకరించి తుది వీడ్కోలర్థిస్తున్నట్లుగా స్ఫురించాయి.

గౌతము డింకొకమా రానందుని వైపు చూచి అత్యంత ప్రశాంత స్వరంతో నెమ్మదిగా ఇలా ఉపదేశించాడు:

“ఆనందా! సమస్త ప్రాణి లోకానికి, సర్వవస్తుజాలానికీ వినాశం సహజం! మీరందరూ నిత్యజాగరూకులై అనంత నిర్వాణ ప్రాప్తికై ప్రయత్నించండి!”

అంతలో ఆకాశంలో ఒక సముజ్జ్వల తారక నేలపై రాలింది!

మరి ఒక మహాతారక దేదీప్యమాన ప్రభాజాలంతో ఆకాశాని కెగసి పోయింది!

—o—